

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

**మేడ్చల్, మే 16. ప్రభాతవార్త :** వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందు రైతులు తగు జాగ్రతలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణాబాయి అన్నారు. మేడ్చల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు శుక్రవారం సందర్శించారు. ముందుగా వడ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్లను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే ముందు దాన్యంలో తేమ శాతం 17 కన్న తక్కువగా ఉండే విదంగా చూసుకోవాలని తెలిపారు. అదే విదంగా తాలు లేకుండా శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకట్రాంరెడ్డి, ఏఓ అర్చన, సొసైటీ సీఈఓ సుజాత, వ్యవసాయ విస్తర్ణ అధికారులు సుమిత, తేజస్వణి, రైతులు అంతిరెడ్డి, శ్రీనివాస్రెడ్డి, వెంకట్రెడ్డి, శ్రీపాల్రెడ్డి, సత్తిరెడ్డి, శంకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్య నాయక్



**ధారూరు, మే16, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవె న్యూసదస్సులను అదనపు కలెక్టర్ లింగ్యనాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు.రైతులతో మాట్లాడి సమస్యల ు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఏమైనాభూ సమస్యలు ఉంటే భూ భారతీయ రెవె న్యూ సదస్సులో దరఖాన్తు చేనుకోవాలనితెలిపారు.ఆయునతోపాటు వికారాబాద్ డివిజన్ రెవె న్యూ అధికారి వాసుచంద్ర, తహసిల్దార్ సాజిదా బేగం,సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్,పంచాయతీ కార్యదర్శి కృష్ణ, కరోబార్ ఆనంద్, రెవె న్యూ సిబ్బంది ఉన్నారు.

## అడ్వాన్స్ సప్లీమెంటరీ పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహించాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్జైన్

**వికారాబాద్, మే 16, ప్రభాతవార్త:** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లీమెంటరీ పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఇంటర్ పరీక్షల అధ్యక్షతన నిర్వహించిన ఇంటర్ పరీక్షల జిల్లా సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అడ్వాన్స్డ్ సప్లీమెంటరీ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నందున దానిక నుగుణంగా ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షలు 2 సెషన్లలో నిర్వహిస్తున్నందున అంతరాయం లేకుండా విద్యుత్తు అందించాలన్నారు. పోస్టల్ డిపార్ట్మెంట్ పార్సెల్స్ కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని అన్నారు. పరీక్షలకు అవసరమైన ఇన్విజిలేటర్లను జిల్లా విద్యాధికారి కేటాయించడం జరుగుతుందని అన్నారు. పరీక్షలు ఈ నెల 22 నుండి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, అదేవిధంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. జిల్లా లోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో 20 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం జనరల్లో 5217, ఒకేషనల్లో 457 ద్వితీయ సంవత్సరం జనరల్లో 2071, ఒకేషనల్లో 314 విద్యార్థులు హాజరువుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, డీఎంహెచ్ఓ వెంకటరవణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ నాయక్, జిల్లా పరీక్షల సమన్వయ కమిటీ సభ్యులు నర్సింహ్ రెడ్డి, సత్తయ్య, ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి, ట్రాన్స్కో ఎస్ఈ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

## కొడంగల్ లో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- రూ.40 లక్షల విలువ గల 20 క్వింటాళ్ళ స్వాధీనం
- ఇరువురిపై కేసు నమోదు- రిమాండ్కు తరలింపు
- నకిలీ అల్లం పేస్టు, మంచినూనె పట్టివేత
- పరిగి డిఎస్పి శ్రీనివాస్




పోలీసులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు



పోలీసులకు పట్టుబడిన నకిలీ అల్లం పేస్టు,మంచినూనే

**కొడంగల్,మే 16ప్రభాతవార్త:** కొడంగల్మండలంలోని అంగడిరైచూర్ గ్రామంలో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని ఓ ఇంటిలో నిల్వ చేసిన సుమారు రూ.40లక్షల విలువ గల(20 క్వింటాళ్ళు) 35 బ్యాగుల నకిలీ పత్తినాలు పోలీసులు పట్టుకోవడం కలకలం రేకెత్తిస్తుంది. నకిలీ పత్తి విత్తనాల కేసుకు సంభందించి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో పరిగిడిఎస్పీ శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఎస్సై జీవీ.సత్యనారాయణ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని అంగడిరైచూర్ గ్రామంలోని మల్లారీ పెద్దమల్లప్పఇంట్లో తనిఖీలు నిర్వహించారు .పోలీసుల తనిఖీల్లో పెద్దమల్లప్ప ఇంట్లో ఎలాంటి ప్రభుత ్వ అనుమతి లేని,లేబుల్ లేని తయారు చేసినకంపెనీ పేరుగాని,గడువుతేది లేక పోవడం తో సుమారు రూ.40లక్షల విలువ గల 35ప్లాస్టిక్ బ్యాగుల్లోలూస్ నకిలీ పత్తివిత్తనాలను పట్టు కున్నారు.నకిలీపత్తి విత్తనాలపై కేసు నమోదు చేసివిచారించగాకర్నాటక రాష్ట్రం ముదేళికి చెందిన ఫర్టిలేజర్ షాపు యజమాని ఎర్రపనేని కొండప్ప నాయుడు దగ్గర నారాయణపేట్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి వెంకటయ్య ద్వారా తాను20క్వింటాళ్ళ లూస్పత్తివిత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలుపడం జరిగిందన్నారు.
పట్టుబడిన నకిలీ పత్తివిత్తనాలవిలువసుమారు రూ.40లక్షలవరకుఉటుందని,సంఘటనపై వ్యవసాయఏఓతులసి ఫిర్యాదుమేరకుకొండప్ప నాయుడు,మంగలి వెంకటయ్యలపై కేసు నమోదు చేసిసమగ్ర విచారణ చేపడుతున్నట్లుడిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.
అలాగేఈనెల14నకొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టిన సమయంలో టాటా ఏసీవాహనాంలో తరలిస్తున్న నకిలీ అల్లం పేస్టు, పకిలీ మంచినూనే పట్టుకోవడం జరిగిందని డిఎస్పీతెలిపారు. కాటేదాన్నుంచి కర్నాటక రాష్ట్రం షాబాద్కుతరలి స్తుండగా పట్టుకొని వాహన డ్రైవర్,యజమాని అహమద్, షాబాజ్ ఇరువురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులఅమాయ కత్వాన్ని అసరాగా చేసుకొని పుట్టగిడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీత్తనాలను అంటగడుతు రైతులను నట్టేట ముంచేందుకు మాయమాటలతోవచ్చేవారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీపత్తివిత్తనా లతోనష్ట పోకుండా రైతులు ప్రభుత్వ లైసెన్స్ డీలర్ల దగ్గరనే విత్తనాలను కొనుగోలు చేసి రసీదు తీసు కోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొడంగల సీఐ శ్రీధర్రెడ్డి, ఎస్సైజీవీ. సత్య తనారాయణ, ఏఈఓలు రాజురాథోడ్, ఇసాక్‌హెరాల్డ్ పాల్గొన్నారు.

## గిరిజన తండాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

### -మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్..

### -రూ.84 లక్షలతో పులిచెర్లకుంట తండాకు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన..



సిసి రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న నాయకులు

**దుద్యాల్, మే 16, ప్రభాతవార్త:** గిరిజన తండాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అని దుద్యాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పులిచెర్లకుంట తండాకు రూ.84 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం కొరకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లెలు, గూడెంలో గిరిజన తండాలు మారుమూల ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరుగుతాయని అన్నారు. దుద్యాల్ మండలం అత్యంత వేగంగా అభివృద్ధిలో దూసుకుపోతుందని గుర్తు చేశారు. అందుకుగా ను బీటీ రోడ్లు, సిసి రోడ్లు, పారిశ్రామిక వాడ ఏర్పాటు వంటి అనేక రకాల అభివృద్ధి ప నులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వందల కోట్ల అభివృద్ధి ప నులు దుద్యాల్ మండలంలో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. మండల కేంద్రంలో మండల సమీకృత భవనాల నిర్మాణం, దాదాపు 200 కోట్ల వరకు నిధులతో మండలంలో ప్రతి గ్రామానికి తాండాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మండలంలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి ప నుల ు అధికార యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. అభివృద్ధి ప నుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటిస్తూ అభివృద్ధి ప నులు సాగుతున్నయని పేర్కొన్నారు. అభివృద్ధి ప నులకు ఎలాంటి అడ్డంకులు కలిగించకుండా మండల అభివృద్ధికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, సీనియర్ నాయకులు సీతారాం నాయక్, యుగంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణ, సత్యనారాయణ, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కావలి నరసింహులు, రామాంజనేయులు, చెన్నంపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నా జీవితం... ప్రజాసేవకే అంకితం: ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుమార్తె గడ్డం అనన్య,మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ

### -నియోజకవర్గంలోని జనం... నీరాజనం..

### -పెద్ద ఎత్తున తరలి వచ్చిన అభిమానులు

**చేవెళ్ల,మే16,ప్రభాతవార్త:**చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కెజిఆర్ గార్డెన్లో చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య జన్మదినంను పురస్కరించుకుని రక్తదాన శిబిరంను ఏర్పాటు చేశారు. చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య చేవెళ్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం మోడల్ పాఠశాలలో చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ క్రిష్ణారెడ్డి వెపిస్తున్న మంచినీటి బోర్కు టెంకాయ కొట్టి బోర్ మోటర్ను ప్రారంబించారు.చేవెళ్లలోనిస్వర్గీయమాజీ ప్రధానిఇందిరగాంధీ, స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి,కొండారంగారెడ్డి,స్వర్గీయమాజీమంత్రి ఇంద్రారెడ్డి, స్వర్గీయ రాజేందర్‌రెడ్డిల విగ్రహాలతోపాటు ప్రముఖుల విగ్రహాలకు చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య పూలమాలలు వేశారు.యుత్ కాంగ్రెస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో211 మంది యువకులు రక్తదానం చేశారు.గజ మాలతో చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్యను ఘనంగా సత్కరించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని జనం చేవెళ్లకు చేరుకుని జనం నీరాజనాలు పలికారు. పెద్ద ఎత్తున జనం తరలివచ్చి యాదన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వారి అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి ఒక్కరు శాలువా..పూల దండ, కెక్ను తీసుకువచ్చి తమ అభిమాన నాయకుడైన యాదన్నతో కెక్ కట్ చేపించి, దండను వెసి శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. జనం రాకతో చేవెళ్ల మండల కేంద్రం జనంతో కిక్కిరిసి పోయింది. నా జీవితం ప్రజా సేవకే అంకితమని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు. జనం కోసం నిరంతర పాటుపడుతానని, నా ఊపిరి ఉన్నంత వరకు చేవెళ్ల నియోజకర్గ అభివృద్ధి కోసమే కృషి చేస్తామన్నారు.చేవెళ్ల ప్రజలకు రుణపడి ఉంటానని, ప్రజల అభిమానంను మరిచిపోలేనన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్రెడ్డి,మాజీ జడ్పి చైర్ పర్సన్ అనితారెడ్డి, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుతురు గడ్డం అనన్యలు చేవెళ్లకు వచ్చి కెక్ తినిపించ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల ఏమ్మెల్యేకాలేయాదయ్యజన్మదినఏర్పాట్లునుమాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ క్రిష్ణారెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్,వైస్ చైర్మన్ రాములు,గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ మంగళి యాదగరి,మండలపార్టీ అద్యక్షులు వీరేందర్‌రెడ్డిలు పకడ్బందీగా చేసి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలోసీనియర్‌నాయకులుజనార్దన్‌రెడ్డి,బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆగిరెడ్డి,దేవర వెంకట్‌రెడ్డి,పడాలప్రభాకర్,గుండాలరాములు,శ్రీనివాస్‌గౌడ్,గిరిదర్‌రెడ్డి,మాజీ సర్పంచులు వెంకటేశం గుప్తా,జాంగిర్,బీమయ్య,శంకర్,మోహన్‌రెడ్డి,గోపాల్‌రెడ్డి, జంగారెడ్డి,కేసారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



-రక్తదాన శిబిరంను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

## డబుల్‌బెడ్ రూమ్స్ హౌజింగ్‌కాలనీలో కమిషనర్ తనిఖీ

**శామీర్‌పేట,మే16,ప్రభాతవార్త:**తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్స్ హౌజింగ్‌కాలనీని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ సందర్శించారు. డబుల్‌బెడ్‌రూమ్స్ వారికి మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, మౌళిక సదుపాయాలపై లబ్దిదారులను ఆయన అడిగి తెలుసు కున్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీలో ఉన్న జిహెచ్ఎంసి (2బిహెచ్‌కె) డబుల్‌బెడ్‌రూమ్స్ హౌజింగ్ కాలనీ సందర్శించి మౌళిక సదుపాయాలు, సౌకర్యాలు, సమస్యలను కమిషనర్ లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఇప్పటి వరకు డబుల్‌బెడ్‌రూమ్స్‌కు సుమారు 456కుటుంబాలు (లబ్దిదారులు) గృహప్రవేశాలు చేయటం జరిగిందన్నారు. నుకున్న విధంగా కనీస సౌకర్యాలు లేనందున చాలా మంది గృహప్రవేశం చేయలేదని, సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తే మాత్రం లబ్దిదారులు అందరు డబుల్‌బెడ్‌రూమ్స్ నివాసాలకు వచ్చె అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. డబుల్‌బెడ్‌రూమ్స్ హౌజింగ్ కాలనీలో మౌళికసదుపాయాలు కల్పించటానికి ప్రభుత్వం, జిహెచ్ఎంసి అధికారులతో పాటు తూంకుంట మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు లబ్దిదారుల మొరను బట్టి స్పష్టం అవుతోంది. డబుల్‌బెడ్‌రూమ్స్‌ను సందర్శించటానికి కమిషనర్, పలువురు అధికారులు సందర్శించటంతో లబ్దిదారుల్లో కొంత మేరకు ఉత్సాహం, ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్‌తో పాటు మున్సిపల్ డిప్యూటీ ఇఇ జి.సునీత, కాలనీవాసులు, అధికారులు, సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువు దోమలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే16 :** ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువు దోమలు అని, అవి కుడితే ఎంతటి వారైనా అనేక వ్యాధులకు గురికాక తప్పదని, అందుకే దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వి.విజలక్ష్మీ తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించగా, డాక్టర్ విజయలక్ష్మీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ అనే దోమ కుట్టడం వల్ల వస్తుందని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా చూసుకోవాలని, నిల్వ ఉండే నీళ్లలో దోమలు పెరుగుతాయని, ఇవి పగటిపూట కుడతాయని డాక్టర్ విజయలక్ష్మీ వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యాధి వచ్చిన వారిలో తీవ్రమైన జ్వరము, శరీరంపై ఎర్రని దద్దులు, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు, చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కార్తీక్, జగదీష్, సంధ్య,బిందు,ఉష,వాల్త్ సూపర్‌వైజర్లు అమృత, శ్రీరామ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## లగచర్లలో పశుగ్రాసం గడ్డివాము దగ్ధం

**దుద్యాల్,మే16,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాతరి మదరప్ప తన దగ్గర ఉన్న పశువులకు మేత కోసం ప్రశుగ్రాసమైన వరిగడ్డిని నిల్వ ఉంచుకున్నాడు. గడ్డివాము కాలిపోతుండడంతో అక్కడికి వెళ్లి మంటల ు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 90శాతం గడ్డి కాలి బూడిదయ్యింది. మూడు ట్రాక్టర్ల గడ్డి వాముల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని రైతు మదరప్పఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## రికార్డుస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు

### రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మే16 ప్రభాతవార్త :** ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం అయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరపరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్‌లతో కలిసి యాసంగి ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అనదపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం అయిందని అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్నాలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 60.14లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 129.35లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని తెలిపారు.2022,23 యాసంగిలో 25.35లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం జరుగగా, 2023,24లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగాయన్నారు. ఈ ఏడాది యాసంగికి సంబందించి ఇప్పటికే 49.53లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని వివరించారు. . ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు.
అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసి పోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగునున్న దృష్ట్యాఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూస్తూండాలన్నారు. కొత్తరేషన్ కార్డులు, కుటుంబ సమస్యల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలపాలని సూచించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ బోగస్ కార్డుల జారీ కాకుండా పకడ్బందీగా పరిశీలన జరపాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్డీవో పిడి శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డిఎస్‌వో, సివిల్ సప్లైస్ డి.ఎం. గోపికృష్ణ, మార్కెటింగ్ శాఖ, ఏ.డి. మహ్మద్ రియాజోద్దీన్, సంబంధిత అధికారుల పాల్గొన్నారు.

## వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ హర్షణీయం

### ..మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



మేడ్చల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గౌతమ్, విద్యాశాఖ జెడి మదన్‌మోహన్, డిఇఓ విజయకుమారిలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 16, ప్రభాతవార్త**ప్రస్తుతం కొనసాగుతున్న సాంకేతిక యుగంలో విద్యాబోధన సామర్థ్యాలను పెంపొందించేందుకు వేసవి సెలవులలో కూడ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించటం హర్షనీయమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లాలోని నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించి పాల్గొన్నారు. ఈసందర్భంగాకలెక్టర్‌గౌతమ్ మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమని తాము ఎపుడు అప్‌డేట్ చేసుకుంటూ విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందన్నారు. తరగతి గదిలో విద్యార్థులు అందరు ఒకేలా నేర్చుకోరని, వారికి ఎలా అవసరమో ఆ విధానాన్ని గ్రహించి విద్యను అందించటామే ఉపాధ్యాయుల గొప్పతనమన్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఇన్‌స్టాల్ చేసుకుని నేర్చుకోవాలని ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణలో భాగంగా ఎన్ని పద్దతులలో శిక్షణ ఇవ్వగలరో అన్ని పద్దతులను తెలుసుకుని విద్యార్థులకు అవసరమైన విధంగా బోధించాలని, జిపిటియాప్ వినియోగించుకుని విద్యారంగాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యాబోధనకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్, డిఇఓ విజయకుమారి, ఉప్పల్ తహసీల్దార్ వాణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో చదివి ఉద్యోగం సంపాదించుకోవాలి
### -నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి



ప్రభుత్వ ఉద్యోగం పొందిన అభిషేక్ కుమార్‌ను సత్కరిస్తున్న నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, చిత్రంలో కార్యదర్శి పద్మజ తదితరులున్నారు.

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:**
హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధీనంలో నిర్వహిస్తున్న గన్‌ఫౌండ్రీ శాఖ గ్రంథాలయంలో పోటీపరీక్షలకు ప్రిపేర్ అయి నీటిపారుదల శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించిన అభిషేక్ కుమార్‌ను ఆ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ, శాఖ గ్రంథాలయం ఇంచార్జ్ సూర్య ప్రకాష్ మహేందర్, వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్, మహేష్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరు అభిషేక్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని పోటీపరీక్షలకు అంకితభావంతో చదివి ఉద్యోగం సంపాదించాలని చైర్మన్ ఉపేందర్ ఆకాంక్షించారు.

## అలరించిన త్రినాధరావు భక్తి గీతాలు



గానం చేస్తున్న స్వరకిన్నెర డా. చింతలపూడి త్రినాథరావు బృందం

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రముఖ గాయకుడు, "భక్తిగాన సుధాకర", స్వరకిన్నెర డా. చింతలపూడి త్రినాథరావు స్వరసారథ్యంలో శుక్రవారం నిర్వహించిన భకినత సంగీత కార్యక్రమం అందరిని ఆధ్యాత్మిక సాగరంలో తేలియాడించింది. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి. శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తి సంగీత కార్యక్రమంలో త్రినాధరావు బహుళ ప్రాచుర్యం పొందిన వెంకటేశ్వర స్వామి గీతాలు, అన్నమయ్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. సంగీత కార్యక్రమంలో లక్ష్మీశాంతి, రాధారాణి, శ్రీనివాసమూర్తి స హ గానం చేయగా రాజేష్ వాద్యసహకారాన్ని అందించారు. అనంతరం ఆలయం నిర్వాహకులు త్రినాధరావు ను ఘనంగా సత్కరించారు.

## నేడే జింఖాన గ్రౌండ్‌లో మా వైష్ణోదేవి జాగరణ్




సమావేశంలో పాల్గొన్న నేతలు

**కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ మా వైష్ణోదేవి జాగారన్ మండల్ ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా మా భగవతి 21వ విశాల్ జాగరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం కంటోన్మెంట్ జింఖానా గ్రౌండ్ మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులను అలరించేందుకు దేశ విదేశాల్లో కీర్తనలు ఆలపించే ప్రముఖ గాయకులు లక్ భీర్ సింగ్ లఖా, అదేవిధంగా రాజు మురారి దహిమ,రాజు బాత్రా,ప్రతీక్ దహిమా, స్వాతి దహిమాలు పాల్గొంటారని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొనే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారని, ఈ కార్యక్రమాలకు కంటోన్మెంట్ బోర్డ్ సిఈఓ, బోర్డు సభ్యురాలు బిజెపి బానుక నర్మద, మాజీ సభ్యులు జె రామకృష్ణ,సురేందర్ జోషి ల సహకారం ఎంతో సంతోషకరం అన్నారు. కమిటీ సభ్యులందరు తమ స్వంత నిధులతో గత 21సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి, బిజెపి మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎన్ శ్రీనివాస్,ఆశీష్ అగర్వాల్,సురేందర్ జోషి,వినోద్ పొద్దార్,కైలాష్ చాంద్ అగర్వాల్,సంజయ్ అగర్వాల్,సందీప్ సింగ్, సంతోష్ జోషి,రాజేష్ గోయల్,హరియం గార్గ్,సందీప్ జోషి,బిఎన్ శ్రీనివాస్,రాజేందర్ అగర్వాల్,లక్ష్మీనారాయణ అగర్వాల్,సంజయ్ కుమార్,సంజయ్ కుమార్ గోయల్,సార్వాన్ అగర్వాల్ పాల్గొన్నారు.

## నేడు ట్యాంక్‌బండ్‌పై 'తిరంగా యాత్ర'
### -బిజెపి నేత డాక్టర్ గౌతంరావు



వాకర్స్‌కు కరపత్రం పంపిణి చేస్తున్న బిజెపి సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ సి.గౌతంరావు తదితరులు

**హైదరాబాద్,మే 16 ప్రభాతవార్త**
ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని బిజెపి సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ సి.గౌతంరావు అన్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారని, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎంపిలు, ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ గేట్ వద్ద వాకర్స్‌కు కరపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి,ఉమా శంకర్, కృష్ణా గౌడ్, కంచ చంద్రశేఖర్, చుక్క జగన్, ఆంజనేయులు, కోడూరి సురేష్, అడపా చంద్రమోళి,ఏడెల్లి బాలు ,షరీఫ్ బాయ్, బుడ్డోళ్ల శివ, రామ్‌రెడ్డి, శ్రీనివాస్, తలారి శివ పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీనివాసుడి కల్యాణం

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:** వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కలియుగప్రత్యక్షదైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల సమక్షంలో రమణీయంగా సాగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, బాలభోగము, బలిహరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు.

## తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి : మేకల సారంగపాణి



కరపత్రాను పంపిణీ చేస్తున్న మేకల సారంగపాణి తదితరులు

**సికింద్రాబాద్, మే 16 ప్రభాతవార్త:** సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి వివేకానంద విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ వారికి సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాధారణ పౌరులు కూడా పాల్గొనాలనే లక్ష్యంతో హోటల్‌లు, టీ పాయింట్‌లు, టిఫిన్ సెంటర్‌ల వద్ద పౌరులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన సోల్జర్లకు నివాళులు అర్పిస్తారని చెప్పారు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు తగిన రీతిలో బుద్ధి చెప్పి ప్రపంచ దేశాల మన్ననలను పొందిన మన ఆర్మీ సిబ్బంది నడిపించిన మహా నాయకుడు నరేంద్ర మోడీ అభినందనలు తెలియజేస్తూ సికింద్రాబాద్, హైదరాబాద్ పౌరులు అందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం చిలకలుగూడ, సీతాఫల్మండి, ఉస్మానియా యూనివర్సిటీ సికింద్రాబాద్ తదితర ప్రాంతాలలో పర్యటించి చలో ట్యాంక్ బండ్ సెల్యూట్ ఫర్ ఆర్మీ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొనాలని వాకర్స్‌కు, యువకులకు, క్రీడాకారులకు పలువురికి ప్రత్యక్షంగా కరపత్రాలు ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ గిరి, రాజేశ్వర రావు, హనుమంతు ముదిరాజ్, ఉపేందర్ స్థానిక బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## పేదల పట్టాల కోసం అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ పరిధిలోని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ లాండ్స్‌లో నివాసం ఉంటున్న దాదాపు పదివేల కుటుంబాలకు పట్టాల మంజూరుకు సంబంధించి బోర్డు సీఈవో మధుకర్ నాయక్, డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమావేశమై చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం భూ బదలాయింపు విషయంలో సానుకూలంగా ఉందని బోర్డు పరిధిలో ఎంత విస్తీరణలో పేదల బస్తీలు ఉన్నాయి, మొత్తం ఎంత మంది ఉంటున్నారు అన్న వివరాలు సమర్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకొని భూ బదలాయింపు ప్రక్రియను ముందుకు తీసుకువెళుతుందని ఎమ్మెల్యే వివరించారు.డిఫెన్స్ , సివిల్ ఏవియేషన్ లాండ్స్ పేదలకు పట్టాల మంజూరు పట్ల ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇటీవలే సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు జిల్లా కలెక్టర్‌తో కూడా చర్చలు జరిపారు. ఇప్పుడు తాజాగా బోర్డు సిఈవో, డిఈవోతో కూడా చర్చలు జరిపారు. ఎమ్మెల్యే ప్రతిపాదన పట్ల వారు సానుకూలంగా స్పందించారని, దీంతో భూ బదలాయింపు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

## డెంగ్యూ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
### -రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**అత్తాపూర్ మే16,ప్రభాతవార్త :**
ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలని అవి పుడితే ఎంతటి వారైనా అనేక వ్యాధులకు గురికాక తప్పదని అందుకే దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.దోమలు పుట్టకుండా చూద్దాం ..దోమలు కుట్టకుండా చూద్దాం అనే నినాదాన్ని పాటించాలని పిలుపునిచ్చారు.గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసం నుండి శివాజీ చౌక్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డెంగ్యూ జ్వరం దోమల ద్వారా వ్యాపించే వైరల్ వ్యాధి అని, దీని నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం ముఖ్యమని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని పులా కుండీలు, పాత టైర్లు మొదలైన వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఫాగింగ్ మెషిన్లు, స్ప్రే యంత్రాల సహాయంతో దోమల నివారణ చేపట్టాలన్నారు.డెంగ్యూ లక్షణాలు జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటివిగా ఉంటాయని వివరించారు. డెంగ్యూకు నిర్దిష్టమైన చికిత్స లేదు, కానీ లక్షణాలను తగ్గించేందుకు వైద్య సహాయం అవసరమని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇంటింటా దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల సహకారం తో మాత్రమే దోమలపై విజయవంతంగా పోరాడగలమన్నారు.

### ఆధ్యాత్మిక వాతావరణంలో ముందుకు సాగితే భవిష్యత్తు బంగారమయం : ఎమ్మెల్యే ముఠాగోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజయసింహాలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:** సనాతన ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక వాతావరణంలో ముందుకు సాగితే భవిష్యత్తు బంగారమయం అవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి. శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ అన్నపూర్ణ తదితరులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, మన్నె దామోదర్‌రెడ్డి, నేతలు ముదిగొండ మురళీ, వెల్లంకి ఇంద్రసేనా రెడ్డి, గోకా నవీన్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి బాలాజీ భవన్‌లో శ్రీలక్ష్మిదేవి అమ్మవారికి కుంకుమ పూజ



టిటిడి శ్రీవారి దేవాయలంలో శ్రీలక్ష్మిదేవి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:**
తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి), హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, బాలాజీ భవన్‌లో ప్రతి నెల 3వ శుక్రవారం జరిగే అమ్మవారి కుంకుమ పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీలక్ష్మిదేవి అమ్మవారికి కుంకుమా పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. వందలాది మంది మహిళలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయం సిబ్బంది భక్తులకు ఉచితంగా పూజా సామాగ్రిని పంపిణి చేశారు. అర్చకులు నరసింహమూర్తి అమ్మవారికి సహస్రనామాలతో మంత్రాలను పఠిస్తుండగా మహిళలు కుంకుమా పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణతోపాటు అన్నదానం కార్యక్రమం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, టిటిడి ఏఈవో రమేష్, దోనర్ త్రినాథ్‌బాబు, అధికారులు శ్రీనివాసప్రభు, మణికంఠ, లక్ష్మిపతి, హరినాద్ తదితరులు భక్తులకు విశేషమైన సేవలు అందించారు.

### నేడు 'తిరంగ ర్యాలీ' ..ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, మే16, ప్రభాతవార్త:**
ట్యాంక్‌బండ్‌పై తలపెట్టిన 'తిరంగ ర్యాలీ' నేపథ్యంలో శనివారం సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సెక్రేటేరియట్ నుంచి వచ్చే వాహనాలను అంబేద్కర్ విగ్రహం రోడ్డులో అనుమతించరు. ట్యాంక్‌బండ్ ప్రధాన దారిలోకి మళ్లించినట్లు తెలిపారు. అదేవిధంగా లిబర్టీ నుంచి తెలుగుతల్లిఫ్లైఓవర్, కర్బలా మైదానం నుంచి సెయిలింగ్‌క్లబ్ , కవాడిగూడ, డీబీఆర్ నుంచి కవాడిగూడ గోశాల మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు.

### 18న సందర్శకులకు సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

**చార్మినార్,మే 16 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ మూసీ నది ఒడ్డున ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియంలో ఇంటర్నేషనల్ మ్యూజియం డే ఉత్సవాలను ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నామని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్.కుసుం తెలిపారు.ఇంటర్నేషనల్ మ్యూజియం డే సందర్భంగా ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటలు వరకు పర్యాటకులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలియజేశారు.ఈ అవకాశాన్ని సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఇంటర్నేషనల్ మ్యూజియం డే సందర్భంగా ఈ నెల 17వ తేదీ శనివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని,ప్రత్యేక ఫోటో ప్రదర్శనలో ప్రపంచంలోని పలు దేశాలలోని మ్యూజియంల చిత్రాలను నెలకొప్పుతున్నామని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ కుసుం తెలిపారు.ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటలు వరకు సాలార్‌జంగ్ మ్యూజియం తెరిచి ఉం టుందని,కేంద్ర సాంస్కృతిక శాఖ ఆదేశాలు మేరకు పర్యాటకులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

### ప్రతిభ కలిగిన కళాకారులకు వయసు అడ్డంకి కాదు
#### -మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి



**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:** నిజమైన ప్రతిభా సంపత్తి ఉంటే వయసు కళా కారులకు అడ్డంకి కాదని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు.శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ గంటిస్ నిర్వాహణలో ప్రముఖ గాయకుడు వై ఎస్ రామ కృష్ణ అరవై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భం గా అభినందన సత్కారం జరిగింది ముఖ్య అతిథిగా డాక్టర్ వేణు గోపాలా చారి పాల్గొని రామ కృష్ణ భార్య లలిత కూడా గాయని కావటం ఇరువురు అభిరుచి ఒక్కటే కావటం అదృష్టం అన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బి సి కమిషన్ పూర్వ చైర్మెన్ డాక్టర్ వకుళా భరణం కృష్ణ మోహన్ రావు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి రాజ గోపాల్ రావు, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, వ్యాపారవేత్త అగర్వాల్, కిన్నెర రఘురాం, ఓంకార్ రాజు, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌పై జిహెచ్‌ఎంసి అధికారులు కొరడా



ఎన్టీఆర్ స్టేడియం లో రోడ్లపై వదిలివేసిన వాహనాలను తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఎంసి రామానుజులరెడ్డి, ట్రాఫిక్ సిఐ వీరేశం తదితరులు

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:** గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ 5 డిప్యూటీ కమీషనర్ రామానుజుల రెడ్డి నేతృత్వంలో శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో అక్రమ పార్కింగ్ పై కొరడా ఝుళిపించారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్ పెక్టర్ వీరేశంతో కలిసి నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో రోడ్లపై వదిలివేసిన వాహనాలను తొలగించే కార్యక్రమాన్ని గురువారం శ్రీకారం చుట్టారు. అనధికార పార్కింగ్ వాహనాలను తొలగించే కార్యక్రమంలో భాగంగా స్వాధీనం చేసుకున్న అన్ని వాహనాలను బహిరంగ వేలంలో స్క్రాప్‌గా విక్రయించడం జరుగుతుందని రామానుజుల రెడ్డి వివరించారు. కాగా తమ దృష్టికి వచ్చిన అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను ఆ ప్రదేశం నుంచి తొలగించి వేలం వేయడానికి సంబంధిత కార్యాలయానికి పంపడం జరిగిందని, ఇంకా తొలగించకుండా ఉన్న వాహనాలను వాహన యజమానులు వెంటనే తొలగించాలని సూచించారు. ఒకవేళ తొలగించని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి ఇదే విధంగా అక్రమ వాహనాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు పూనుకుంటామని వివరించారు.

## ప్రభుత్వ స్థలాలను ఓపెన్ గ్రౌండ్లు, ప్లే ఏరియాలుగా అభివృద్ధి చేయాలి
### -కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, చిత్రంలో భరత్‌గౌడ్, పావనీ వినయకుమార్ తదితరులు

**చిక్కడపల్లి, మే 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను విక్రయించకుండా, వీటిని ఓపెన్ గ్రౌండ్లుగా, ప్లే ఏరియాలుగా అభివృద్ధి చేస్తే ఈ స్థలాలు రాబోయే తరాల అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడతాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి బస్తీ, కాలనీలోని సంఘాలు తమ పరిధిలో ఉన్న ప్లే గ్రౌండ్లను పరిరక్షించే బాధ్యతను తీసుకోవడంతో పాటు ప్రభుత్వ స్థలాలను పచ్చదనంగా ఉంచుతూ, పిల్లల కోసం అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నివి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో స్థానిక శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అండర్-14 క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భారత్ గౌడ్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, కవాడీగూడ కార్పొరేటర్ రచనశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్,డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్,డివిజన్ బీజేపీ నేతలు రత్న సాయి చంద్,శ్రీకాంత్, దామోదర్, విఎస్టీ రాజు, ఎం.ఉమేష్, పాల శ్రీను, మహమూద్,సత్తి రెడ్డి,ఆకుల సురేందర్, సురేష్,మదన్మోహన్, శ్రీనివాస్,ఆనంద్ రావు,సాయి కుమార్, నర్సింహ, సురేష్, హన్మంతు,యాదగిరి,అరుణ్ కుమార్,రాహుల్,సాయి తేజ, నీరజ్,సూరజ్ తదితరులు పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో విద్యాసంస్థలు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం చదు వుపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో అవసరమని, అయితే మన రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ప్లే గ్రౌండ్ల కొరత తీవ్రమైందని, జీహెచ్‌ఎంసీతో పాటు, కొన్ని కాలనీ సంఘాలు ప్లే గ్రౌండ్లను పార్కులుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్కుల అవసరం ఉన్నప్పటికీ, పిల్లలకు ఆటల కోసం ఓపెన్ గ్రౌండ్లు అవసరమని, ఇవి వారి భవిష్యత్తుకు ఎంతో అవ సరమన్నారు.

## బాధితులపై విజిలెన్స్ అధికారులు పెండింగ్ కేసులు ఎత్తివేయాలి

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:** సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది బాధితులు శుక్రవారం ఇందిరా పార్కు ఎదుట ధర్నా నిర్వహించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలు సర్వీస్ పూర్తి చేసుకుని అనారోగ్య కారణాలతో కార్పొరేట్, మెడికల్ బోర్డుచే మెడికల్ ఇన్వాలిడి డేట్ అయ్యి డిపెండెంట్ ఉద్యోగం కోరకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ ధరఖాస్తులను విజిలెన్స్ అధికారులు మారుపేర్లపై ఉద్యోగం చేసిన వారిని రెండు పేర్లు ఉన్నాయన్న కారణంతో దరఖాస్తు చేసుకున్నవారికి డిపెండెంట్ ఉద్యోగాన్ని ఇవ్వకుండా 15 సంవత్సరాల నుంచి తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. సకాలంలో ఉద్యోగం రాక ఏలాంటి ఉపాధి మార్గం లేక ఆర్థిక ఇబ్బందులకు వారు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి ఇబ్బందులను గుర్తించి సింగరేణి కుటుంబ వారసులను అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో బాధితులు లక్‌శ్రావణ్, తిరుమల శ్రీనివాస్, ప్రదీప్ వర్మ, ఓం ప్రకాష్, రాజయ్య, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కార్పొరేటర్




జాతీయ డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**బేగంబజార్,మే 16ప్రభాతవార్త:** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేయడం ద్వారా అనారోగ్యాలకు గురై ప్రమాద ముందని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు. శుక్రవారం మహానగర పాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ ఆయన, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, మలేరియా అధికారులు, జిహెచ్‌ఎంసి అధికారులు,సిబ్బందితో కలిసి ర్యాలీ పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తా చెదారంతోపాటు,పనికి రాని వస్తువులను నిల్వ ఉంచడం మూలంగా అందులో దోమలు వృద్ధి చెందుతుంటాయన్నారు. దీని మూలంగా ప్రజలు కూడా అనారోగ్యాలకు గురై అవకాశాలు ఉంటాయన్నారు.ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.డెంగ్యూ నివారణ ప్రత్యేక అవగాహన ప్రజలు కలిగి ఉండాలన్నారు.ఈ ర్యాలీలో ఎస్.ఇ గంగప్ప,రాజు,దిలీప్,ఎంటామాలజిస్టు సిబ్బంది పాల్గొన్నారు.

### ఘాన్సీబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా నితేష్ అగర్వాల్



ఘాన్సీ బజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా నియమితులైన నితేష్ అగర్వాల్‌ను బిజెపి నాయకులు అభినంధిస్తున్న దృశ్యం

**చార్మినార్,మే 16 ప్రభాతవార్త :**
మిట్టికాషేర్ ప్రాంతానికి చెందిన నితేష్ అగర్వాల్‌ను ఘాన్సీ బజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా నియమిస్తూ గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర నియామక పత్రాన్ని అందజేశారు.దాదాపు పద్దెనిమిది సంవత్సరాలు నుంచి నితేష్ అగర్వాల్ బిజెపి పటిష్టత కోసం పాటు పడుతున్నారు. గతంలో నితేష్ అగర్వాల్ ఘాన్సీబజార్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.ఘాన్సీబజార్ డివిజన్ బిజెపి నూతన అధ్యక్షులుగా నియమితులైన నితేష్ అగర్వాల్ మాట్లాడుతూ పాతబస్తీలో బిజెపిని బలోపేతం చేయటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.ఘాన్సీబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా నియమితులైన నితేష్ అగర్వాల్‌ను పాతబస్తీకి చెందిన ప్రవీణ్ శెట్టి,ప్రవీణ్ బంగడీ,ఉమేష్ సింగానియా, తరుణ్ అగర్వాల్,ఫంకజ్ వర్మ,ఆనంద తివారీ,అనిల్ బజాజ్,దినేష్ సింగ్,పవన్ మిశ్ర,నరేష్ కుమార్ అవస్తీ,వివేక్ నారాయణ సంఘీ,అశోక్ సేన్,సునీల్ సింగ్,ఆకాష్ అగర్వాల్, వైభవ్ శర్మ,ముకేష్ అగర్వాల్,ఉమేష్ సోనీ,శ్రీధర్ యాదవ్, వికాస్ ఘాడియాతో పాటు పలువురు సన్మానించారు.

### ఆటస్థలం అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలి



ఫలక్‌నుమా డిఎంసి అరుణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్,మే 16 ప్రభాతవార్త :** చందూలాల్ బారాదరిలోని దూద్‌బౌలి వార్డు కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సాలార్ మిల్లత్ సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ పేరు మీద ఉన్న ఆట స్థలం నిరుయోగంగా మారిందని,ఆట స్థలం అభివృద్ది కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫలక్‌నుమా డిఎంసి అరుణ్‌కు శుక్రవారం బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు.లక్ష లాది రూపాయల వ్యయంతో చందూలాల్ బారాదరిలో ఆట స్థలాన్ని నిర్మించారని,ప్రస్తుతం ఆట స్థలం చెత్తతో నిండి పోయిందని,చెత్త చెదారాన్ని తొలగించి వేసవి కాలం సందర్భంగా పిల్లలు ఆడుకోవటానికి ఆటస్థలాన్ని తిరిగి ప్రారంభించాలని డిఎంసి అరుణ్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పులిపాటి రాజేష్ కుమార్,హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి మీర్ మహమూద్ అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

### కుటుంబ సమస్యలతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ఉప్పల్, మే 16 ప్రభాతవార్త :** కుటుంబ సమస్యలతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఇందిరానగర్‌కు చెందిన తోకట దేవేందర్ (40) పాల వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఈనెల 15వ తేదిన రాత్రి ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్ద ఉన్న సాయి బాబా దేవాలయం సమీపంలోని తన బర్రెల దొడ్డికి పాలు తేవడం కోసం వెళ్లాడు. రాత్రి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు షెడ్డు వద్దకు వెళ్లి చూడగా ఐరన్ రాడ్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఉప్పల్‌లో ఓయో హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్య

**ఉప్పల్, మే 16 ప్రభాతవార్త :** ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లోని ఒయో హోటల్‌లో ఒక యువకుడి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లోని ఓయో టౌన్ హౌస్‌చే సిగ్మా అనే హోటల్‌లో మూడు రోజుల క్రితం యాదగిరిగుట్ట మండలం, చిన్న కందుకూరుకు చెందిన ఎర్ర జగదీష్‌కుమార్ (23) ఈనెల 12వ తేదిన గది అద్దెకు తీసుకుని ఉన్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో గత మూడు రోజుల నుంచి కనిపించకుండా పోవడంతో బంధువులు యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఒయో హోటల్ గది నుంచి దురాస్వన వస్తుండడంతో నిర్వహకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహం కళ్లిన స్థితిలో ఉందని, దీనిపై విచారణ చేస్తున్నామని ఉప్పల్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రెడిట్ కార్డు బిల్లు రికవరీ ఏజెంట్‌పై కుక్కతో దాడి

**యూసుఫ్‌గూడ, మే 16, ప్రభాతవార్త**
క్రెడిట్ కార్డు బాకీ వసూలు చేయడానికి వచ్చిన ఏజెంట్‌పై కుక్కను వదిలి దాడి చేయించిన ఘటన వెంగళ్‌రావునగర్ పరిధిలోని జవహర్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే జూబ్లీహిల్స్ జవహర్‌నగర్‌కు చెందిన నందివర్ధన్ అనే వ్యక్తికి రూ.2 లక్షల వరకు క్రెడిట్ కార్డు బాకీ ఉంది. ఈ బాకీ వసూలు చేయడానికి వచ్చిన ఏజెంట్ సత్యనారాయణపై నందివర్ధన్ అకస్మాత్తుగా తన పెంపుడు కుక్కను ఉసిగొల్పాడు. దీంతో ఆ కుక్క ఏజెంట్‌పై దాడి చేసి తీవ్రంగా కరిచి గాయపర్చింది. గాయాలైన బాధితుడు సత్యనారాయణ వెంటనే మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వివాహేతర సంబంధాలు.. అనుమానాలతో ఆత్మహత్యలు

- మంటకలుస్తున్న మానవబంధాలు
- అధికశాతం ఒంటరి కుటుంబాల్లోనే
- పిల్లల ప్రాణాలు తీస్తున్న బాధిత దంపతులు
- ఇటీవలే మేడిపల్లిలో తల్లి,కుమార్తె మృతి



**హైదరాబాద్, మే16, ప్రభాతవార్త:** దంపతుల నడుమ అనుమానం పెనుభూతమై కుటుంభాలనే వెలవేస్తుంది. చిన్నపాటి మనస్పర్ధలు, గొడువలకు సర్దిచేప్పేవారు లేక క్షణికావేశంలో మరణశాసనాలు రాసుకుంటున్నారు. నా అనేవారు లేకపోవడంతో లోలోపల కుంగిపోతూ జీవింతపై విరక్తి చెందుతున్నారు. కుటుంబంలో యజమానితో పాటు సలహ, సూచనలు చేసేందుకైన ఒక ఇంటికి పెద్ద దిక్కు ఉంటేనే ఆ కుటుంబం పచ్చగా ఉంటుందనే పూర్వీకులు చెబుతుండేవారు. కానీ ప్రస్తుత కాలంలో జీవిత అనుభవాలు, కుటుంబ బంధాలు తెలియక ఒంటరి జీవనానికి ఇష్టపడి అర్ధాంతరంగా ముగింపు పలుకుతున్నారు. ముక్కుపచ్చలారని పసిపిల్లలను సైతం ప్రాణాలను తీసి దాంపత్యానికే మాయని మచ్చగా మిగులుస్తున్నారు. ఇటీవల కాలంలో ఇష్టపడ్డ అమ్మాయి దక్కలేదనే కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో తన భర్తనే కిరాతకంగా చంపాడు ఓ ప్రభుద్ధుడు. బాలాపూర్ ఘటనలో భార్యపై అనుమానంతో భర్త అంతమొందించాడు. ఇక మేడిపల్లి పరిధిలో భార్యపై అనుమానంతో ఇరువురి నడుమ తరచు గొడువుల కారణంగా ముగ్గురు పిల్లలతో కలిసి చెరువులో దూకడంతో తల్లి,కుమార్తె మృతి చెందారు. ఇలా ఎన్నో ఘటనలు నగరంలో జరుగుతున్నాయి. సంతోషం, ఆనందంతో దాంపత్యాన్ని సాగాల్సిన దంపతులు ఆర్థికసమస్యలు, అత్యాశలతో తికమక ఆలోచనలతో బతుకే లేకుండా చేసుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత ఆరు నెలల్లో సుమారు వందకు పైగా కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి.

**సోషల్‌మీడియాతోనే కలహాలు..చిన్నాభిన్నం...**

కుంటుభాల్లో చిచ్చురేపేది అధికంగా సోషల్‌మీడియానే. పరిచయం లేని వారిని కూడా బంధం కలిపేలా చేస్తూ వ్యక్తిగత పనులన్నింటిని దూరం పెట్టి దానికే అకింతమవుతున్నారు. పిల్లలను సైతం పట్టించుకోకపోవడంతో చిర్రుబుర్రులాడుతూ దంపతుల నడుమ చీటికిమాటికి అయ్యే చిన్నపాటి గొడువలే విడాకులు తీసుకునే వరకు వస్తున్నాయి. అపరిచిత వ్యక్తిల ఫోన్‌లు వచ్చిన అనుమనాలు రేకెత్తిస్తున్నాయి. ఆలుమగల్లో పరస్పరం ఎవరైనా ప్రశ్నించిన కలహాలకు ఆజ్యంగా మారుతోంది. వాట్సాప్‌లు, ఫోన్‌మెస్సేజ్‌లు, ఇన్‌స్టా, ఎక్స్, తదితర వాటిలో సరదాగా చాటింగ్‌లు చేసిన వ్యసనంగా మారుతోంది. అపరిచిత వ్యక్తులు మాయమాటలు, పొగడ్తలకు తలొగ్గడమే కాకుండా తనకంటూ ఒక భరోసా, ప్రోత్సాహకాలతో ఆలోచనతీరు, మైండ్ డైవర్షన్‌కు దారి తీస్తుందని సైకాలాజిస్టులు చెబుతున్నారు. భార్య భర్తల అనుబంధం కొనసాగాలంటే ప్రేమనురాగాలు, ఆత్మీయబంధాలు, బంధుగణం, పెద్దరికంతో కలుపుగోలుగా మాటలు ఉంటేనే ఆనందకరమైన జీవనం సాధ్యపడుతుందని సూచిస్తున్నారు. సంసారం అనే బతుకులో బాధలు, సంతోషాలు ఉంటాయని, ఈ రెండింటిని పంచుకునేందుకు నా అనేవారు ఉంటేనే లైఫ్ ఇజ్ బ్యూటిఫుల్. ఏదీ కొరవడిన విచ్ఛినానికి బీజం పడుతుందని వివరిస్తున్నారు.

**పెద్దోలు ఉన్నారే....**

ఇంటి పెద్ద దిక్కు లేపోతే వెలతీ స్పష్టంగా కనిఎస్తుంది. యాంత్రిక జీవనంలో పగలు రాత్రి తేడా లేకుండా బిజీబిజీగా ఉన్న పని ఒత్తిడితో కుటుంభానికి కొంత సమయం కూడా కేటాయించకుండా ఉంటున్నాం. దీంతో ఒంటరిగా ఫీలింగ్ రావడంతోనే ఏవేవో అనవసరపు ఆలోచనలు, అప్పటికే ఆర్థికభారాలు సతమతమవుతున్న సందర్భంలో మాట్లాడే తోడుకు ఆకర్షితులవుతున్నారు. దీంతోనే హాయ్..భాయ్..అనే నుంచి క్లోజ్‌నెస్ ఏర్పడడంతోనే అనుమనాలు ప్రారంభం. చిన్నపాటి గొడువలను సాగదాయకుండా అడ్డువేసేందుకు ఎవరో ఒకరు మన బాధలు పంచుకుంటే సద్దుమణుగుతాయి. కానీ పెద్దవాళ్ల ఇగోలతో అమాయక పిల్లల జీవితాలు పణంగా పెట్టాల్సిన దుస్థితి. స్వస్థలానికి దూరంగా ఉద్యోగాలు, వ్యాపారాలకై సిటికి వచ్చినవారే ఉన్నారు. పెద్దదిక్కుగా ఉన్న తల్లిదండ్రులు పిల్లల కుటుంబాల అయిన అద్దె నివాసాల్లో ఉండే కర్మ మాకు పట్టలేదనే ఇగో మాటలతోఒంటరిగా సొంత ఇంటిలో ఉంటూ బంధాలకు దూరమవుతున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు వదిలి రాలేక ఏడాదికో ఆరు నెలలకో బాధలు, కష్టాలు దిగమింగుకుని పండుగ, శుభ కార్యాలకే వచ్చిపోయిన బాంధవ్యాలు మెరుగుపడడం లేదనే తెలుస్తోంది.

## డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**హైదరాబాద్, మే 16,ప్రభాతవార్త:** జాతీయ డెంగ్యు దినో త్సవం సందర్భంగా బంజారాహిల్స్ డివిజ న్‌లో మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద మండల ప్రైమరీ హెల్త్ సెంటర్లో జిహెచ్ఎంసి ఎంటమాలజీ విభాగం, హెల్త్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెంగ్యు నివారణ అవగాహన ర్యాలీలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ర్యాలీలో పాల్గొని ప్రజలకు డెంగ్యుపై అవగాహన కల్పించారు. ఇంటి ఇంటికి వెళ్లి డెంగ్యు ముప్పు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి వద్ద నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, వాటిని తొలగించాలని ప్రజలకు చెప్పారు. అదేవిధంగా ప్రతి ఇంటికీ డెంగ్యు నివారణ స్టికర్లు అంటించి, ప్రజల్లో చైతన్యం నింపారు.ఈ సందర్భంగామేయర్ మాట్లాడుతూ, డెంగ్యు నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలాన్నారు. మన ఇంట్లో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,అప్పుడే దోమలతో వచ్చే అన్ని వ్యాధు లను నివారించగలమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ ఎంసి అధికారులు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె జులై 9కి వాయిదా

**సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:** కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఆధ్వర్యం లో ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించాల్సి న 'సార్వత్రిక సమ్మె'ను జులై 9వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర కార్మి క సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశం సార్వత్రిక సమ్మెను వాయిదా వేసిందని ఆయన చెప్పారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు మతం పేరిట మారణహోమం చేసి 26 మంది అమాయక పర్యాటకలను నిర్ధాక్షిణ్యంగా కాల్చి చంపారని, దీంతో సార్వత్రిక సమ్మెను వాయిదా వేయడం జరిగిందన్నారు. దేశంలోని కోట్లాది మంది కార్మికులు, నాయ కులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభు త్వం 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పడానికి జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'పారిశుధ్య నిర్వాహణ' పై జిహెచ్ఎంసి ఫోకస్



- -రోడ్లు, నాళాలు, ఖాళీప్రదేశాల్లో చెత్తవేస్తే ఫైన్లు
- -గత రెండున్నర నెలల్లో రూ.44లక్షల జరిమానా
- -అత్యధికంగా మూసాపేట్.. అత్యల్పంగా గోషామహాల్
- -పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకే అంటున్న అధికారులు

**హైదరాబాద్,మే 16,ప్రభాతవార్త:** నగరంలో స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణపై జీహెచ్ఎంసీ ఫోకస్ చేసింది.. గ్రేటర్ పరిధిలోని రోడ్లపై చెత్త వేస్తే చలాన్ల మోత మోగిస్తున్నారు.. నాళాలు, చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. పారిశుద్ధ నిర్వహణ, జరిమానాల విధించడానికి కాంప్రెన్సివ్ చలాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (సిసిఎంఎస్) యాప్ తీసుకొచ్చారు.. దీని ఆధారంగా చెత్త వేస్తున్న వారిపై జరిమానాలు విధిస్తున్నారు. మార్చ్ 1న యాప్ తీసుకురాగా గ్రేటర్ పరిధిలో ఉన్న 30 సర్కిళ్ల పరిధిలో గత రెండున్నర నెలల్లో దాదాపు 44 లక్షల రూపాయల చలాన్స్ విధించారు. వీటిలో అత్యధికంగా మూసాపేట సర్కిల్లో 7 లక్షల 86 వేల 500 రూపాయల జరిమానాలు విధించారు.. అత్యల్పంగా గోషామహల్ సర్కిల్లో 4,800 రూపాయల ఫైన్స్ వేశారు.

**ఇదివరకే ఉన్నా..**

రోడ్లపై, ఇతర ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించే విధానం ఎప్పటి నుంచో ఉన్నా అది కేవలం మొక్కుబడిగా ఉండేది. చలాన్స్ వేసి రసీదు ఇచ్చేవారు కానీ ఇప్పుడు జరిమానాల విధానం పారదర్శకంగా అమలయ్యేందుకు మొబైల్ యాప్‌ను తీసుకొచ్చారు. శానిటేషన్ విభాగానికి సంబంధించిన జరిమానాల విధింపును ఏఎంఒహెచ్‌లు , నిర్మాణ వ్యర్థాలపై ఉండే జరిమానాలను టౌన్ ప్లానింగ్ అధికారులు విధిస్తున్నారు. ఈ యాప్ లో సర్కిళ్ల వారీగా అధికారులకు లాగిన్‌లు ఇచ్చేశారు.. జరిమానా విధించేటప్పుడు ఉల్లంఘన ఫొటో తీసి... అధికారి పేరు, జరిమానా మొత్తం, ఉల్లంఘనుల పేరు, ఫోన్ నెంబరు, చిరునామాతో డిజిటల్ రసీదు వస్తుంది. అన్ని రకాల జరిమానాలు యాప్ ద్వారా ఆన్లైన్ లోనే చెల్లించాల్సి ఉంటుంది. జరిమానాలు చెల్లింపు వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో ప్రజలకు పంపిస్తున్నారు.. ఉల్లంఘన జరిగిన ప్రాంతం, లోకేషన్ క్యాప్చర్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

**19రకాల ఫైన్లు..**

రోడ్డుపై చెత్త వేయడం, బహిరంగ మూత్ర విసర్జన చేస్తే రూ.100, గోడలపై రాతలు, కాలువల్లో చెత్త వేస్తే రూ.1,000 ఫైన్ వేస్తున్నారు. దుకాణదారులు రోడ్డుపై చెత్త వేస్తే రూ.1000-2000, అనుమతి తీసుకోకుండా వాల్ పోస్టర్లు వేస్తే రూ.2000, అనుమతి లేని బ్యానర్లు, కటౌట్లపై రూ.5000ఫైన్ వేస్తున్నారు.. అలాగే బస్తీలు, కాలనీ రోడ్లపై, ఖాళీస్థలాల్లో సీ అండ్ డీ వేస్ట్ డంపింగ్ చేస్తే 5వేలు చెరువులు, రోడ్లు, నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే 5వేలు, బహిరంగంగా ప్లాస్టిక్‌ను కాలిస్తే 5వేలు, ప్లాస్టిక్ కవర్లు, సంచులు అమ్మినా, స్టోర్ చేసి పెట్టుకున్నా మొదటి సారి 10వేలు, రెండో సారి దొరికితే 25వేలు, మూడోసారి దొరికితే షాప్ సీజ్ చేస్తామంటున్నారు అధికారులు. నిర్మాణ వ్యర్థాలను అనుమతి లేని వాహనాలకు ఇచ్చే సంస్థలకు 50వేల జరిమానాలు వేస్తున్నారు..నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, ప్రజల్లో పరిశుభ్రతపై బాధ్యతను పెంచేందుకు చలాన్స్ విధిస్తున్నామంటున్నారు బల్దియా అధికారులు పేర్కొంటున్నారు.

# వర్షాలకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

**-నాలాలు, వాటర్ లాగిన్‌పాయింట్లపై ప్రత్యేక దృష్టి**
**-శాఖల సమన్వయంతో కంట్రోల్‌రూం ఏర్పాటు**
**-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ట్రాఫిక్ అడిషనల్ సిపి జోయల్ డెవిస్ తదితరులు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పేర్కొన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాన్సూన్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ట్రాఫిక్, పోలీస్ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మాన్సూన్ సీజన్‌లో నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జోన్‌ల వారిగా డీసిల్టింగ్ పనుల పురోగతి, వాటర్ లాగిన్ పాయింట్లు, వర్షాలతో సంభవించే సంక్షోభ పరిస్థితుల పరిష్కారంపై చర్చించి పలు సూచనలు చేశారు. ప్రధాన నాలాలు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌లను వేగవంతంగా పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. వాటర్ లాగిన్ పాయింట్ లకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను అవసరం మేరకు ఏర్పాటు చేయాలన్నారు.మొబైల్ రెస్పాన్స్ టీమ్ వాహనానికి జీహెచ్ఎంసీ లోగో తో సైనేజి బోర్డు పెట్టాలని, వారి ఫోన్ నెంబర్లను అన్ని పోలీస్ స్టేషన్ లో (ఎస్.హెచ్.ఓ) ఇవ్వాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూం వద్ద జిహెచ్ఎంసి స్టాఫ్ షిఫ్ట్ సిస్టమ్ 24 గంటలపాటు పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో కలిసి కట్టుగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ముందుకు పోవాలన్నారు.ట్రాఫిక్ అడిషనల్ సిపి జోయల్ డెవిస్ మాట్లాడుతూ... రోడ్డు తవ్వకాలు చేసి విడిచిపెట్టకుండా వెంటనే తొలగించాలని, తద్వారా వర్షాల సందర్భంలో ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నదని, ఇలాంటి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్లు పడిపోవడం వలన కూడా ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతంలో ముందస్తుగా చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు,వర్షాల సందర్భంగా వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యే సందర్భంలో కూడా సమస్య ఎదురవుతుంది. అందుకు జిహెచ్ఎంసి పెద్ద క్రేన్ లను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచి పోయిన సందర్భంలో సిగ్నల్ వ్యవస్థ కూడా పని చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడ ఒక ట్రాఫిక్ పోలీస్ తో పాటుగా ముగ్గురిని పెట్టినా పరిష్కారం కావడం లేనందున సిగ్నల్ కు బ్యాక్ ఆఫ్ బ్యాటరీ ఏర్పాటు చేయాలని, వెదర్ అలెర్ట్ సకాలంలో సరియైన విధంగా అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, వెంకన్న, రవికిరణ్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్‌రావు, సి.ఈ రత్నాకర్, జోనల్ఎస్ఈలు మహేశ్వర్ రెడ్డి, శంకర్, సిసిపి శ్రీనివాస్, ఈఈలు, డిఈ లు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో కబ్జాదారులకు సిరులు కురిపిస్తున్న రెవెన్యూ అధికారుల అలసత్వం

- మణికొండలో రూ.5.కోట్ల ప్రభుత్వ భూమి కబ్జార్పణం
- దొంగ పట్టాలతో పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వం 278.పట్టాలిస్తే... ఇప్పుడు 500.కు పైగా ఇళ్ళు వెలిశాయి



మణికొండ సర్వే నెంబర్ 261.లో ఇటీవల వెలిసిన కొన్ని అక్రమ నిర్మాణాల దృశ్యం

**నార్సింగి, మే 16 ప్రభాతవార్త :** గండిపేట మండల రెవెన్యూ అధికారుల అలసత్వం కబ్జాదారులకు సిరుల పంట పండిస్తుంది. రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ భూమి హారతి కర్పూరంలా కరిగిపోతోంది. తెలియకుండా కబ్జాలు జరిగితే సరిపుచ్చుకోవచ్చు కానీ... అంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఈ కబ్జాల భాగోతం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కబ్జాల పర్వం వెనుకాల కొంత మంది రాజకీయ నాయకులు, వారి శిశ్యులు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. గండిపేట మండలంలో కంచే చేను మేసిన చందంగా తయారైంది రెవెన్యూ అధికారుల తీరు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసమే విధులు నిర్వహిస్తున్నామన్న వాస్తవాన్ని గండిపేట మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది మరిచిపోయినట్లు ఉన్నారు. అందుకే ఇక్కడ కబ్జాదారులు దర్జాగా సర్కారు భూమిని కబ్జా చేసేస్తున్నారు.

**మణికొండలో...**

గండిపేట మండలం మణికొండ గ్రామ సర్వే నెంబర్ 261.లో ఉన్న పదెకరాల స్థలంలో రెండు ఎకరాలు దేవాలయాలకు వదిలిపెట్టారు. 2.వేల గజాల స్థలంలో ఆర్టీఏ కార్యాలయం నిర్మించారు. కొంత స్థలంలో స్మశాన వాటిక లున్నాయి. మిగిలిన ఏడెకరాల స్థలంలో 278. మంది పేదలకు 60.గజాల పట్టాలను అప్పటి సర్పంచ్ కొండకళ్ల లక్ష్మమ్మ రామకృష్ణారెడ్డి హాయాంలో, ఎమ్మార్వో హన్మంత్‌రెడ్డి ఇవ్వడం జరిగింది. 60.గజాల పట్టాలకు కేటాయించిన తరువాత చాలా స్థలం ఖాళీగా ఉండేది. మణికొండలోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. గత ఆరు నెలల కాలంలో ఏకంగా 20.పట్టాల వరకు దొంగ పట్టాలు తయారు చేసి ఇతరులకు అమ్మినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొన్ని పట్టాలలో రెండంతస్థుల భవనాలు కూడా నిర్మించుకున్నారు. ఒక్కో 60.గజాల దొంగ పట్టాను రూ.25-30.లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం 278.మంది పేదలకు మాత్రమే 60.గజాల పట్టాలను కేటాయించగా ఇప్పుడు ఏకంగా అవి 500.కు పైగా పెరిగిపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికార గణం స్పందించి కబ్జాలన్నింటిని తొలగించి, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

**దొంగ పట్టాలపై చర్యలు తీసుకోవాలి**
**: మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి**



మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామ కృష్ణారెడ్డి

2006.వ,సంవత్సరంలో మణికొండలో కేవలం 278.పట్టాలు మాత్రమే ప్రభుత్వం ఇచ్చిందని, ఆ తరువాత కొందరు దొంగ పట్టాలు సృష్టించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రేకుల ఇళ్లు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నారని మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ దొంగ పట్టాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో? ఎవరు సృష్టిస్తున్నారో? అధికారులు విచారించాల్సి న అవసరం ఉందన్నారు. దర్జాగా కబ్జాలు జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భావి పౌరుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కబ్జాలన్నింటిని తొలగించి ప్రభుత్వ స్థలంను కాపాడాలని, లేదంటే జిల్లా కలెక్టర్, రెవెన్యూ మంత్రిని కలిసి ఈ కబ్జాల విషయంపై ఫిర్యాదు చేస్తామని రామకృష్ణారెడ్డి వివరించారు.

**తహసీల్దార్ వివరణ :**



గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

మణికొండలో జరుగుతున్న 60.గజాల కబ్జాల పర్వంపై "ప్రభాతవార్త" గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వివరణ కోరగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. నేనే స్వయంగా వెళ్లి ఎన్ని పట్టాలు ప్రభుత్వం ఇచ్చింది? ఎన్ని అదనంగా వచ్చాయో? పరిశీలిస్తానని పేర్కొన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కబ్జా చేసిన ప్రతీ ఒక్కరిపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. నా హయాంలో ఒక్క గజం ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా ఊరుకునేది లేదని, కొత్తగా వెలిసిన గుడిసెలు, రేకుల ఇళ్లు, పక్కా ఇళ్లు అన్నింటిని కూల్చి వేస్తామని స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌నియంత్రణలో హైదరాబాదే అగ్రస్థానం

**- అంతర్జాతీయ గుర్తింపు...సిపి సివి ఆనంద్‌కు అవార్డు ప్రదానం**
**-దుబాయ్ సమ్మిట్ వేదికగా ప్రతినిధుల ప్రశంసల వెల్లువ**




ఎక్స్‌లెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్ అవార్డుతో నగర సీపీ సీవీ ఆనంద్‌తో ప్రతినిధులు

**హైదరాబాద్, మే16, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు, వినియోగ అక్రమ రవాణా నేరాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. భవిష్యత్తునే నిర్మించాల్సి న యువత డ్రగ్స్ వ్యసానానికి బానిసై కుటుంబాలకు పెనుభారమవుతున్నారు. దీన్ని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌గా తీసుకొని విద్యార్థులు, పౌరులకు అవగాహన కల్పించడంతో విక్రయదారులను గుర్తించి కఠినచర్యలు చేపడుతున్నారు. ఎక్కడికక్కడ కట్టడియే పరమావధిగా భావించి నిరంతరం దానిపై నిమజ్ఞమయ్యారు నగర పోలీసులు. ఇలా మూడేళ్ల కాలంలో తగ్గుముఖం పట్టి విజయాలు సాధించడంతో డ్రగ్స్ రహిత నగరంగా ప్రపంచస్థాయిలో హైదరాబాద్ ప్రథమస్థానంలో నిలిచింది. ఈ మేరకు దుబాయ్ వేదికగా నాలుగు రోజులపాటు జరిగిన వరల్డ్ పోలీస్ సమ్మిట్ (డబ్లూపీపీ) సదస్సులో నగర సీపీ సీవీ.ఆనంద్ 'ఎక్స్‌లెన్స్ ఇన్ యాంటి నార్కోటిక్' అవార్డును అందుకున్నారు. హెచ్‌న్యూ అనుసరించి వినూత్న విధానంతో ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 12దేశాల ప్రతినిధులు ఆవిష్కరించిన ప్రదర్శనలో మనకు ప్రథమస్థానం దక్కిందని సీవీ.ఆనంద్ వివరించారు. దేశంలో ఎదుర్కొంటున్న మాదకద్రవ్యాల సమస్యలు, ముఖ్యంగా కోవిడ్ తర్వాత, మాదకద్రవ్యాలు ప్రవేశించే వివిధ మార్గాలు, వివిధ ముఠాలు,పెడ్లర్లనుపట్టుకోవడంపై చర్చించినట్లు పేర్కొన్నారు.

# నేటి నుంచి మెట్రో టికెట్ ధరలు అమల్లోకి

**-కనిష్టం రూ.12, గరిష్టం రూ.75కి పెంపు**



**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త**

పెరిగిన మెట్రో రైలు ఛార్జీలు శనివారం నుంచి అమలుకానున్నాయి.ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు ఈనెల 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఇప్పటికే విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. పెరుగుదల 20 నుంచి 25 శాతం వరకు ఉంది. ఛార్జీలనే కాదు దూరం కుదించి శ్లాబ్‌లను మార్చడంతో మధ్య శ్లాబుల్లో ఉన్న ప్రయాణికులపై పెంపు భారం అధికంగా ఉంది. ఛార్జీల పరంగా పది శ్లాబులు ఉన్నాయి. ఇందులో మార్పు లేకున్నా పలు శ్లాబుల్లో దూరం కుదించారు.ఈ సవరణతో వార్షికంగా రూ.100 కోట్ల పైనే అదనపు ఆదాయం వస్తుందని ఎల్అండ్‌టి మెట్రో అధికారులు అంచనా వేస్తున్నారు.

**మెట్రో ఛార్జీలు ఇలా..**

మొదటి 2 స్టాపుల వరకు రూ.12లు ఛార్జిగా ఉండనుంది. అలాగే 2 నుంచి 4 స్టాపుల వరకు రూ.18 ఛార్జి,4 నుంచి 6 స్టాపుల వరకు రూ.30 ఛార్జి, 6 నుంచి 9 స్టాపుల వరకు రూ.40 ఛార్జి, 9 నుంచి 12 స్టాపుల వరకు రూ.50 ఛార్జి, 12 నుంచి 15 స్టాపుల వరకు రూ.55 ఛార్జి, 15 నుంచి 18 స్టాపుల వరకు రూ.60 ఛార్జి, 18 నుంచి 21 స్టాపుల వరకు రూ.66 ఛార్జి, 21 నుంచి 24 స్టాపుల వరకు రూ.70 ఛార్జి,26 కి.మీ నుంచి ఆపై స్టాప్‌లకు రూ.75లు చొప్పున వసూలు చేస్తారు.

**ప్రయాణికుల నుంచి విమర్శలు..**

ఒక్కసారిగా 20 నుంచి 25 శాతం టికెట్ ధరలు పెరగడంతో ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా మెట్రోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఛార్జీలతో సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులను మెట్రో దూరం చేసుకుంటుందని పేర్కొంటున్నారు.పెంచిన మెట్రో ధరలతో ప్రయాణికుల సంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణం సదుపాయం ఉండటంతో మెట్రోకు దూరం కావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మిస్ వరల్డ్ పోటీల వేళ.. ఇజ్రాయిల్ జెండా తొలగింపు

**హైదరాబాద్, మే16, ప్రభాతవార్త:** మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న వేళ సచివాలయం ఎదుట ఓ యువకుడు ఇజ్రాయిల్ జాతీయ పతకాన్ని తొలగించిన వైనం సంచలనం రేపింది. గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో సచివాలయం ప్రాంగణం వద్ద వందకు పైగా దేశాలకు సంబంధించిన జాతీయ పతకాలను ఎగురవేశారు. ప్రపంచదేశాల సుందరీమణులు సచివాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ఆయా దేశాల జాతీయ పతాకాలను ఎగురవేశారు. అయితే ఆయా దేశాల జాతీయ పతాకాలను ఎగురవేసిన కొద్దిసేపట్లోకి బైక్‌పై వచ్చిన కొందరు ఇజ్రాయిల్ జాతీయ పతాకాన్ని తొలగించారు. అనంతరం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియలో పోస్టు చేశారు. ఈ విషయం తెలిసిన సైఫాబాద్ పోలీసులు రంగంలోకి దిగి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఇజ్రాయిల్ జాతీయ పతాకాన్ని తిరిగి ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ చర్యలకు పాల్పడిన వారిలో కొందరిని గుర్తించినట్లు సమాచారం. వీరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

## బొడ్రాయి ప్రతిష్టాపనకు పూజలు



బొడ్రాయి ప్రతిష్టకు పూజలు చేస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్,మే16,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో నాభీశిల బొడ్రాయి) ప్రతిష్టాపనపూజలుఘనంగాజరుగుతున్నాయి. గురువారంరాత్రి ఇడబ్ల్యు ఎస్‌కాలనీ నుంచి విగ్రహాలను డప్పుశబ్దాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. శుక్రవారం బొడ్రాయి ప్రాంగణంలో అర్చకులురాధాకృష్ణశర్మవైదికబృందం ద్వారా కలశస్థాపన, మంటపారాధన, మూలవిగ్రహజలాదివానం, హోమం, ధన్యాధివావం, పుష్పాధివాసం, శయ్యాదివాసం, పరదోషపూజ, మంత్రపుష్పం తదితరులు పూజలుజరిపారు. బచ్చునగేశ్‌గుప్తదంపతులుస్థాపిక పూజలో పాల్గొన్నారు. బొడ్రాయిప్రతిష్టాపనలోఉత్సవకమిటీసభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కులసంఘాలసభ్యులుపాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలోఅన్నప్రసాదవితరణ గావించారు. పట్టణంలో ప్రధారరోడ్ల వెంటవివిధరకాలుగా ఆకర్షణీయమైన లైటింట్ ఏర్పాటు చేశారు. శనివారంమూలవిగ్రహపంచామృతఅభిషేకం, యంత్ర ప్రతిష్ట, విగ్రహప్రతిష్టనునిర్వహిచేందుకుఏర్పాటుచేస్తున్నారు. మాజీఎంపిపి బండారి దాసుగౌడ్, బండారిశ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీవైఎస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీకౌన్సిలర్లుబండారి అంజనేయులు, కొమ్మిడిఅనురాధ, మాజీవార్డుసభ్యులుమామిండ్లచిత్తారియాదవ్ పాల్గొన్నారు.

## నేటి మనం సైతం-దేశం కోసం ర్యాలీకి తరలిరండి

**ఘట్‌కేసర్, మే 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై శనివారం జరుగుతున్నమనంసైతం..దేశంకోసంర్యాలీకి పెద్దసంఖ్యలో తరలిరావాలని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యురాలు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గసభ్యురాలు-ఎంపిటిసికొమ్మిడిశోభారాణిలుపిలుపు నిచ్చారు. పెహల్గాంలోపర్యాటకులపైజరిగినపాకిస్తాన్‌ప్రేరేపిత ఉగ్రవాదుల దాష్టీకానికిబదులుగాప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వ ంలో త్రివిధదళాల శౌర్యపరాక్రమంతో పీఓకేలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి ఆపరేషన్ సిందూర్‌ను విజయాన్ని సాధించిన సందర్భంగా భారత సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని నింపేందకు హైదరాబాద్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు శనివారం సాయంత్రం 5గంటలకుమనంసైతం..దేశం కోసం ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. మేడ్చల్‌రూరల్‌జిల్లాలోనివివిధ మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లనుంచి కుల,మత రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యంలో ర్యాలీలో పాల్గొనాలని వారు కోరారు.

## మైసమ్మగుట్ట దేవాలయంలో హుండీ సొమ్ముల చోరీ

-రూ.30 వేలు చోరీ..కేసు నమోదు



హుండీలను ఆలయం బయట వేసిన దృశ్యం

**ఘట్‌కేసర్,మే16,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌గట్టుమైసమ్మగుట్ట దేవాలయంలో హుండీలుచోరీ అయిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు 6 హుండీలు బయట వేసి ఉండటాన్ని గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘట్‌కేసర్ పోలీసులు చేరుకొని దేవాలయం బయట వేసిన హుండీలను పరిశీలించి వివరాలు సేకరించారు. రెండు నెలలకు ఒక సారి హుండీల డబ్బులను లెక్కింపు చేస్తారని గత రెండు నెలలుగా భక్తులు సమర్పించి కానుకలు హుండీలో ఉన్నాయని ఈవో దాదాపు రూ.30,000లు ఉంటాయని తెలిపారు. గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి హుండీల డబ్బులను చోరీ చేశారని సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పరుశురాం తెలిపారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో మైనర్ బాలికలకు బెదిరింపులు

**ఘట్‌కేసర్,మే16, ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్‌లో ఓఆకతాయి ప్రేమపేరుతో మైనర్ మైనర్ బాలికను బెదిరింపులకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అవుషాపూర్‌కు చెందిన మైనర్ బాలిక (16) అంకుశాపూర్‌లోని ప్రిన్స్‌టన్ కళాశాలలో డిప్లొమా రెండో సంవత్సరం చదువుతుండగా సంవత్సరం క్రితం గుర్రం అవినాష్‌రెడ్డిఅనేవ్యక్తి ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. తాను ప్రేమిస్తున్నానని తన ప్రేమను అంగీకరించాలని పలుసార్లు కోరగా బాలిక తిరస్కరిస్తూ వస్తుంది. ఆరు నెలల క్రితం బాలిక అవినాష్‌రెడ్డితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో తన పోన్‌లో అవినాష్‌రెడ్డి పోటోలు తీసుకున్నాడు. గత 15 రోజుల క్రితం అవినాష్‌రెడ్డి బాలికను డబ్బులు తీసుకురావాలని వేధించాడు.

బాలికడబ్బులుఇవ్వకపోవడంతో తనతో తీసుకున్న పోటోలనుసోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. డబ్బులు లేకుంటే ఇంట్లో ఉన్న బంగారు అభరణాలు తీసుకువస్తే పోటోలు డెలిట్ చేస్తానని బెదిరింపులకుపాల్పడగా చేసిది ఏమిలేక మైనర్‌బాలికతీసుకువెళి ఇవ్వగామీ చెల్లెలిని కూడా తీసుకురావాలని బెదిరించగా అక్కఆత్మహత్య యత్నం చేసిందని స్థానికులు తెలిపారు. ఈఘటనతోబాధిత బాలిక ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుతున్నామని సీఐ పరుశురాం తెలిపారు.

## ఆర్టీసీ మర్యాద దినంలో గులాబీల అందజేత



ప్రయాణికులకు గులాబిపువ్వు ఇస్తున్న డిఎం కవిత

**ఘట్‌కేసర్,మే16,ప్రభాతవార్త:** ఆర్టీసీబస్సులో ప్రయాణికులకు మర్యాద దినోత్సవంలోభాగంగాశుక్రవారం ఆర్టీసీచెంగిచర్లడిపో మేనేజర్ కె.కవిత గులాబిపువ్వులనుఅందజేశారు. ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్‌లో శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఆమె గులాబి పువ్వులను ఇచ్చి సన్మానించారు. ఆర్టీసీబస్సు సురక్షితమైన ప్రయాణమని ఆమె అవగాహన కల్పించారు. బస్సు ఎకే క్రసమయంలో దిగేటప్పుడు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని డిఎం సూచించారు. ఈకార్యక్రమంలో సహాయ మేనేజర్ (ట్రాఫిక్) చంద్రమౌళీ, ప్రయాణికులు, ఉద్యోగులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కొడంగల్ రూరల్, మే 16 (ప్రభాతవార్త):** కొడంగల్ మండలంలో 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. కొడంగల్ మండలంలోని పర్సాపూర్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, పాత కొడంగల్ గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంటలవరకు విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్‌వినియోగదారులుసహకరించాలని కోరారు..

# 12వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

### హర్షం వ్యక్తం చేసిన చైర్మన్ యాట గీతనర్సింహ్మా



వరికొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వడ్లు తూకం వేస్తున్న చైర్మన్ యాట గీతనర్సింహ్మా

**ఆమనగల్లు,మే16, ప్రభాతవార్త:** గిట్టుబాటు ధరను కల్పించడమే కాకుండా దళారి వ్యవస్థ నుండి రైతును కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆమనగల్లు మార్కెట్ కమిటి చైర్మన్ యాట గీతనర్సింహ్మముదిరాజ్ అన్నారు. రైతులు పండించిన ధాన్యం సుప్రభుత్వం నిర్వహిస్తున్నకొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకుని లబ్ధిపొందాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోనివ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నవరికొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ యాటగీత నర్సింహ్మా శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున వచ్చిన ధాన్యంను చూసి ఆనందం వ్యక్తం చేశారు. వరికొనుగోలు కేంద్రంకు వస్తున్న ధాన్యంవిక్రయస్పందనబాగుందనికొనియాడారు. గిట్టుబాటు ధరలు కల్పించాలనే లక్ష్యంతోరాష్ట్రప్రభుత్వంఏగ్రేడుధాన్యం క్వింటాల్‌కురూ.2320 మద్దతు ధరకల్పిస్తుందని, ఇదిరైతుకుఎంతో లాభదాయకమని వివరించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో కొనసాగుతున్న వరికొనుగోలుకేంద్రంలో స్వల్పకాలం లోనే 12వేలక్వింటాళ్ళ వరిధాన్యం సేకరించినట్లుఆమె తెలిపారు. ప్రభుత్వం పైరైతులకు ఉన్న విశ్వాసానికి ఇదినిదర్శనమన్నారు. ధాన్యం పెద్దమొత్తంలోవస్తున్నందున్నకొనుగోలుకేంద్రం వద్దరైతు ఎటువంటిఇబ్బందులు పడకుండాఅదనంగా కూలీలతోపాటు తూకం కాంటాల సంఖ్యను పెంచినటు చైర్మన్ తెలిపారు. దీంతోరైతుకుసమయంఆదాఅవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగేధాన్యంఅమ్మడానికివచ్చేరైతులుమధ్యాహ్నం ఆకలితో అలమటించకుండా సొంత డబ్బులతో భోజన వసతి కల్పించానని చైర్మన్ గీతనర్సింహ్మా తెలిపారు. రైతుకు అన్నం పెట్టడం ఆనందంగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేయగా, భోజనవసతిఏర్పాటుచేసి12రోజులుగా నిర్విరామంగా కొనసాగిస్తున్నందుకుపలువురురైతులు, వ్యాపారులుచైర్మన్‌పై ప్రశంసలు కురిపించారు. మార్కెట్‌కమిటి డైరెక్టర్‌వస్పులశ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మడిసిసికార్యదర్శి గూడూరుశ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకార్యదర్శి బిక్యనాయక్, హనుమనాయక్, బిచ్చునాయక్, ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడువస్పులశ్రీకాంత్, మల్లేశ్, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, కిచ్యనాయక్, వినోద్, మల్లేశ్, రాములు, విజేందర్‌లు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**కడ్తాల్,మే16,ప్రభాతవార్త :** కడ్తాల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో పిడిజి చెన్న కిషన్ రెడ్డి సహకారంతో కొనసాగుతున్న రాగి అంబలి ఉచిత పంపిణీ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధికార ప్రతినిధి గుడూరు శ్రీనివాస్‌రెడ్డి తల్లితండ్రులైన కీ.శే గూడూరు పుష్పమ్మ నారాయణ రెడ్డి గార్ల జ్ఞాపకార్ధంగా పిడిజి చెన్న కిషన్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, తహసీల్దార్‌ముంతాజ్‌బేగం, ఎంపిడిఓ సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులతో, నాయకులు, లయన్స్ క్లబ్ మిత్రులతో కలిసి మండలపరిసర ప్రాంత ప్రజలకు ఉచితరాగిఅంబలి ప్రసాదంపంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగాడిసిసిఅధికారప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అమనగల్ సవలు అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా నాయొక్కతల్లితండ్రులైనకీ.శేగూడూరుపుష్పమ్మనారాయణరెడ్డిగార్ల జ్ఞాపకార్ధంగా ప్రజలందరికీ ఉచితరాగి అంబలి చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామీణప్రాంతప్రజలకుఉచితంగా సేవలందిం చడంలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉందని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ఆమనగల్ ఒకక్లబ్‌మాత్రమే కాదని, సమాజ సేవకు శక్తివంతమైన ఉద్యమని వారు అన్నారు. డిసిసి ప్రధాన కార్యదర్శి భీఖ్యా నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మండల పార్టీ అధ్యక్షులు లయన్ బీచ్యా నాయక్, సేవాదల్ అధ్యక్షులు లయన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌నరేష్, రంగారెడ్డిజిల్లాయూత్‌కాంగ్రెస్‌ప్రధానకార్యదర్శి లయన్‌క్యామ రాజేష్, నాయకులుజాంగిర్ అలీ, మాలే మల్లేష్ గౌడ్, కృష్ణ, బిక్షపతి, మల్లయ్య, ప్రజలు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతో భూసారాన్ని కాపాడాలి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య



రైతువేదికలో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య

**కోట్‌పల్లి,మే16,ప్రభాతవార్త:** రసాయనఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకాన్ని పెంచి నేల యొక్క ఆరోగ్యాన్ని కాపాడ ఎకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య అన్నారు. శుక్రవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని బుగ్గాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. వ్యవసాయ పరిశోధన సంస్థ, తాండూర్ నుంచి వచ్చిన శాస్త్రవేతలు నూతన సాగు మెలకువలు రైతులందరితో పంచుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. వానకాలంలో సాగు సమయంలో వ్యవసాయ పరిశోధన సంస్థ తాండూర్ నందు కంది యొక్క విత్తనాలు అందుబాటులో ఉంటాయని శాస్త్రవేతలు తెలియజేశారన్నారు. రైతులు అడిగిన పలు సబ్సిడీ పరికరాలను నోట్ చేసుకొని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. పంట విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని వారు తెలియజేశారు. ఎరువులు విత్తనాలు లేదా ఇతర ఏమైనా వ్యవసాయ సమస్యలు ఉంటే వెంటనే సంబధిత వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. పంట మార్పిడి, అలాగే మిశ్రమ పంట ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. జీవ సంబంద సస్యరక్షణ, లింగకర్షక బుట్టల వినియోగం మొదలైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పప్పునూనె గింజ పంటలను పండించాలన్నారు. భూసాయ ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టిసాగుఖర్చు తగ్గించుకోవాలని రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు యమునారెడ్డి, సుజాత, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, నర్మద, ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.

## వరికొయ్యలు కాల్చడం మానండి

మండల వ్యవసాయాధికారి గోపాల్‌నాయక్

**కొత్తూర్,మార్చి 16, ప్రభాతవార్త :** వరి కొయ్యలు కాల్చడం మానండి ఖర్చు తగ్గించి లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి గోపాల్‌నాయక్ అన్నారు. కొత్తూర్ మండలంలో వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 4000ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. పంటను కోసిన తర్వాత రైతులు వరి మొదళ్ల(కొయ్యలు) కాల్చడం సాధారణంగా మారిపోయింది. అయితే ఈ చర్య వల్ల రైతులకు ఉపయోగం కన్నా నష్టం ఎక్కువ అవుతుందన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నాశనమవుతుండగా, పొగ వాతావరణాన్ని కలుషితం చేస్తుందన్నారు. ఫలితంగా పరిసర ప్రజలకు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం పెరిగిపోతుందన్నారు. ఇంకా మామిడిచెట్లు, హరితహారంలోనాటిన మొక్కలు కూడా అగ్నికి అహుతావుతున్నాయి. గతంలోరైతులుఈఅవశేషాలనుభూమిలో కలియదిగి ప్రకృతి సిద్ధమైన ఎరువుగా మార్చేవారని అధికారులు గుర్తు చేస్తున్నారు. నేడు కూడా అదే విధానాన్ని పాటిస్తే రైతులకు మేలే జరుగుతుందన్నారు. వరి కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదగ్గి ప్రతి ఎకరాకు 3బస్తాల సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లితే అవి సహజ ఎరువుగా మారి భూమిసారాన్ని పెంచుతాయి. దీంతో రసాయన ఎరువుల ఖర్చు సుమారు 50శాతం వరకు తగ్గుతుంది. ఇక మరింత ముందుచూపుతో వ్యవహరిస్తూ కొయ్యల దున్నిన వెంటనే జనుమ విత్తనాలు చల్లితే, 40=45రోజుల్లో పూతకు వచ్చిన తర్వాత ట్రాక్టర్‌కి జీవీత్సతో దున్నడం ద్వారా అవి మట్టితో కలిసిపోతాయి. ఇది భవిష్యత్తులో రసాయన ఎరువులపై ఆధారాన్ని మరింతగా తగ్గిస్తుందన్నారు. రైతులు ఒక్కరినొక్కడిగా మొదలుపెట్టి ఈప్రక్రియను అవలంబిస్తే, ఇతరులు కూడా ప్రేరణ పొంది ప్రకృతిని రక్షిస్తూ తమ ఖర్చులను తగ్గించుకుంటారని వ్యవసాయశాఖ అధికారులు అశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రత్యేక పూజలు చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**షాబాద్, మే16,ప్రభాతవార్త:** శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపనను షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాములు, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ స్వాముల విగ్రహాలను, ధ్వజస్తంభం, నవగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. గత వారం రోజులుగా ఆలయంలో వేద పండితులతో హోమాలు నిర్వహించి, గ్రామస్తులు పూజలు చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు దర్శన్, మల్లేష్, శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచులు కావలి మల్లేష్, జనార్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బోగులలింగం, నరేందర్ రెడ్డి, దర్శన్, శేఖర్, బందమహేందర్‌గౌడ్, రాజుగౌడ్, జంగయ్య ,శ్రీరామ కమిటీసభ్యుదురాఘవేందర్‌గుప్తా, సత్య నారాయణ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, రవి, చేవెళ్ల స్వామి, సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుండాల అశోక్, పొన్న వెంకట్ రెడ్డి దండు రాహుల్, గౌరీశ్వర్, శేఖర్, శ్రీనివాస్, చంద్రారెడ్డి, వడ్లఆచారి, గోపాల్, లక్ష్మయ్య, సత్తయ్య, నర్సింలు, కృష్ణ ,శేఖర్, ప్రవీణ్, యాదయ్య, భాస్కరాచారి, శ్రీనివాస్, అశోక్ చారి, పాల్గొన్నారు.

## మహిళ హత్య

**మేడ్చల్,మే 16.ప్రభాతవార్త :** ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం వికారాబాద్‌కుకు చెందిన లక్ష్మీ (50) మేడ్చల్ మండలంలోని అత్వెల్లి గ్రామంలో నివాసముంటూ రోజు వారి కూలీగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నది. శుక్రవారంతెల్లవారుజామునగ్రామంలోఆమెనివాసముంటున్న రేకుల ఇంటిలో నుండి పొగలు వస్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులుఇంటి లోపలికి వెళ్లి చూడగా సగం కాలిపోయిన లక్ష్మీ మృతదేహన్ని గమనించారు. కాగా గుర్తు తెలియని దుండగులు ఆమెను హత్య చేసి అనంతరం కాల్చి వేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలంలో ఏసీపీ శంకర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ పరిశీలించి క్లూస్ టీమును రప్పించి ఆదారాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాందీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నారంలో జైభీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే16 :** ఆనాడైనా ఈనాడైనా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, సంక్షేమ పథకాలలో ముందు వరుసలో మహిళలకే గౌరవం దక్కుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అన్నారంగ్రామంలో అన్నారంలో జైభీం, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌గ్రామంలోని బిఆర్.అంబేద్కర్, మహాత్మాగాంధీవిగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోభారీర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలను గ్రామసభలోప్రదర్శించారు.

ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు పెద్దపీట వేశామని, సంక్షేమకార్యక్రమాలో వారికి ప్రాధాన్యత ఇచ్చామని, ముఖ్యంగా 2025-26 బడ్జెట్‌లో మహిళలకే తొలిప్రాధాన్యతఇచ్చి ఎన్నో నిధులు మంజూరు చేశామని స్పష్టం చేశారు. బిజెపి కేంద్ర పాలకుల కబంధ హస్తాలలో నలిగిపోతున్న దేశాన్ని రక్షించడానికి ప్రజలు ముందుక రావాలని అన్నారు. కార్పోరేట్ రంగ సంస్థలకు దాసోహమైన మోదీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్నారని, జైబాబు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలతో దేశంలో రాజ్యాంగానికి తూట్లు పడకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నామని గుర్తు చేశారు. ఇళ్లకు శంకుస్థాపనఅన్నారం గ్రామానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ



ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని చెప్పి మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది లోపే అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి అర్హులకు ఇండ్లు ఇస్తున్నామనిఅన్నారు. దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం ఇచ్చినపేదప్రజలను గౌరవిస్తున్నామని, రాబోయేకాలంలో మరిన్నిఅభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలి





అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

**ఆమనగల్లు,మే,ప్రభాతవార్త:** ప్రాణాంతకంగా మారుతున్న డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఆమనగల్లు సిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ మంజులదేవి అన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణతో డెంగ్యూవ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని ఆమె సూచించారు. శుక్రవారంజాతీయడెంగ్యూనివారణదినోత్సవం పురస్కరించుకుని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీనినిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై సలహాలు సూచనలుఅందజేశారు. ప్రతిఒక్కరూదోమలనివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకువరినరాలనుశుభ్రతనుపాటించాలని, ప్రతి మంగళ, శుక్రవారండ్రైడేనుపాటించాలనిసూచించారు. జ్వరం బాధ పడుతున్నవారు అనుమానంఉంటే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రచనసింగ్, సూపర్‌వైజర్ నాగేశ్వరి, సిబ్బందిమేసుమని, హెప్సిబా, దేవేందర్, నర్సింగ్, ఫార్మాసిస్టు ఇందిరా, సీత, మాధవి, విజయ్‌కుమార్, గుజ్జరి శ్రీను, ఆశకార్యకర్తలు ఉన్నారు.

## వ్యవసాయ విధానాలపై అవగాహన కార్యక్రమం

**కడ్తాల్, మే16,ప్రభాతవార్త:** కడ్తాల్ మండలంలోని నాగిరెడ్డి గూడ, న్యామతాపూర్, గ్రామాల్లోరైతులకుజయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వి.అనిత, టి.సుప్రజా, విద్యాసాగర్‌రావుమాట్లాడుతూరైతుదగ్గరకే తాముచ్చిమని అన్నారు. నేలసంరక్షణకుఅంతర్ పంటలు వేయాలనిం ాబోయే రోజులలోనీటిఎద్దడిపెరుగుతుందని దానికి అనుగుణంగా బిందు సేద్యం ద్వారాసాగునుకొనసాగించాలని రైతులకు శాస్త్రవేత్త లు అధికారులు సూచించారు. రైతు తన ధర తాను నిర్ణయించాలంటే ఒక్క వ్యవసాయం మీదనేఆధారపడితేచాలదనివిలువ ఆధారిత ఉత్పత్తులను కూడా తాయారు చేయాలని అభిప్రాయపడ్డారు. పొలంలోఉన్నప్రతికీటకంమనకి హాని కలిగించేది కాదని మిత్ర పురుగులు కూడా ఉంటాయని కాబట్టి రైతులు రసాయనాలు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాయికి శిరీష దీప్తి శ్రీలత అనుష ఏవోలు అనూష శ్రీకాంత్ అభినవ్ వర్షిని అనుజ, కశ్యప్, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షుడు యాదిరెడ్డి

**షాబాద్,మే16, ప్రభాతవార్త:** ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కిసాన్ సంగ్ మండ అధ్యక్షుడు యాదవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లో అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్న అన్నారు. ఓవైపు పంటలకు నీరు అందక మరోవైపు అకాల వర్షాలకుపంటలుదెబ్బతినులతోరైతులదుస్థితి ఇబ్బందిగా మారిందన్నారు. వరిరైతులుప్రైవేటమార్కెట్ కు తీసుకెళ్తే క్వింటాలకు 500నుంచి 1800 రూపాయలకు వడ్లు అమ్ము కుంటున్నా రన్నారు. ప్రభుత్వం వరి కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులకు 500 రూపాయల బోనస్ కూడా రైతు నష్టపోతున్నారన్నారు రైతుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ రెడ్డి వెంకట్ రెడ్డి మల్లయ్య, మల్లయ్య, చంద్రయ్య, నర్సింలు, సత్యంగౌడ్, చంద్రకళ, కృష్ణ, పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వీరనాగమ్మ కళ్యాణ మహోత్సవం



**కేశంపేట మే 16 ప్రభాతవార్త :** ఆరెకటికల కుల దైవం వీరనాగమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం వేడుకలు శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వీరన్నగమ్మతల్లిని శుక్రవారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారి గంగాజలంతోగంగపూజకు, అనంతరం అమ్మవారికి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అమ్మవారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణాన్ని తిలకించే అందుకు వచ్చిన భక్తులకు అన్న విస్తరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముల్తంకర్ శివాజీ, సత్యనారాయణ, నాగేశ్వర్, రామచందర్, లక్ష్మణ్, పాండు, మహేందర్, శ్రీనివాస్, కిట్టు, నరేష్, జగన్, మల్లికార్జున్, పవన్, బాలాజీ, వెంకటేష్, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

**కేశంపేట మే 16 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని ఎక్లాస్ ఖాన్ పేట, బైర్ఖాన్ పల్లి గ్రామాలలో శనివారం షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ హాజరై ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా మండల పరిధి లోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, సింగిల్ విండో డైరెక్టర్స్, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్‌నాయకురాలు, రైతులు, ఎన్ఎస్‌యుఐనాయకులు, ఓబీసీ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్ ,మైనార్టీ సెల్, కిసాన్ సెల్, మరియు మండల పరిధిలోని కాంగ్రెస్‌నాయకులుఅధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమానికి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకులకు 11 గంటల 30 నిమిషాలకు ఏక్లాస్ ఖాన్ పేట గ్రామంలో విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం: డాక్టర్ నికిత

**కేశంపేట మే 16 ప్రభాతవార్త :** అంతర్జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి డెంగ్యూ వ్యాధి నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేసిన డాక్టర్ నికిత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులు వచ్చేందుకు ముఖ్య కారణం దోమలు అని దోమలు కుట్టిన వారికి వ్యాధులు సోకడం తప్పనిసరి జరుగుతుందని దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అన్నారు. అంతర్ జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా దోమలు కుట్టకుండా చూద్దాం అనే నినాదాన్ని తీసుకువచ్చారు, దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు సంసిద్ధం కావాలని, దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు అని దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, లాంటి పలు రకాల వ్యాధులు వస్తాయని ఆమె అన్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే మన పరిసర ప్రాంతాలలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిలువ ఉన్న ప్రాంతాలలో క్యూలెక్స్ దోమ, ఎడిసో దోమ, పిల్లాస్ దోమలు పెరుగుతాయని అన్నారు. దోమలు కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధి వస్తుందని డెంగ్యూ వ్యాధి వల్ల శరీరంలోని శక్తిని కోల్పోయే విధంగా చేస్తుందని, వ్యాధి సోకిన లక్షణాలు కనబడితే వెంబడే సరైన చికిత్స చేయించుకోవాలని నిర్లక్ష్యం వహించి చేయించుకోకుంటే మనిషి చనిపోయే ప్రమాదం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి పరిసర ప్రాంతాలలో నేటి నిల్వలు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఇలాంటి లక్షణాలు ఏవైనా ఉంటే వెంబడే ఆసుపత్రికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఎంపి హెచ్ ఈ ఓ అంజిలమ్మ, సూపర్వైజర్ సంధ్య, సుదీప్తి, ఆసుపత్రి సిబ్బంది, అన్ని గ్రామాల ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.